విద్యార్థుల ఉన్నత విద్యకు చేయూతనివ్వడం అభినందనీయం : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సమాజంలోని పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల ఉన్నత విద్యకు చేయూతను ఇవ్వడం అభినందనీయమని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురంలోని కాపు సంఘం కార్యాలయంలో సోమవారం సత్యసాగర మాణిక్యాంబ కాపు చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, చెక్కుల దాత బొలిశెట్టి నర్సింహారావు(తాతాలు) ఆధ్వర్యంలో 22 మంది పేద విద్యార్థులకు, 54మంది వితంతువులకు ఆర్థిక సహకారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాగర మాణిక్యాంబ కాపు చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఎంతోమంది వెనుకబడిన విద్యార్థులకు, వింతతు మహిళలకు, వృద్ధులకు పెన్షన్లు అందించడం గొప్పవిషయం అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, ట్రస్ట్ కార్యదర్శి సుబ్బారాయన్, రామారావు, బాబ, తాతాజే, రుద్రారావు, కాపుసంఘం అధ్యక్షుడు కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు హైడ్రా పనిచేస్తుంది

● కమిషనర్ రంగనాథ్



రాచకాలువను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఇతర అధికారులు

వనస్థలిపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల పరిరక్షణకు హైడ్రా పనిచేస్తుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీ, జక్కిడి రామస్వామినగర్ కాలనీల్లో కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు సోమవారం సాయంత్రం హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంబంధిత అధికారులతో కలిసి ఆక్రమణలకు గురైన రాచకాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్రమణకు గురైన ఏపీఆర్ విల్లాస్ ఎదురుగా ఉన్న నాలాను, బృందావన్ మిడోస్ కాలనీకి అనుకుని ఉన్న కెఎస్ఎం వెంచర్ వెనుక భాగంలో ఉన్న రాచకాలువ బఫర్‌జోన్‌లో నుంచి కాలువ ను పునరుద్ధరించాలన్నారు. ఈ పనులకు ఎవరైన ఆటంకాలు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. రాబోయే మూడు రోజుల్లో ఈ పనులకు పోలీసుల సహకారం తీసుకుని రాచకాలువను పునరుద్ధరించాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ శుక్లజ, హైడ్రా డీఈ శివకుమార్, హైడ్రా సీఐ సైదులు, జేఈ సతీష్, న్యాక్ ఇంజనీర్ అశోక్, సర్వేయర్ జ్యోతి, కాలనీవాసులు శశికాంత్, నందకిషోర్, చిత్రంజన్, వేణు, ప్రభాకర్ పాల్గొన్నారు.



బొడ్రాయి ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే రంగారెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి

ఘనంగా బొడ్రాయి, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

హయత్‌నగర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్‌లో సోమవారం నాభిశిల(బొడ్రాయి), రేణుకా ఎల్లమ్మ ఆలయం ఎదుట ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. వేదపండితులు ప్రత్యేకంగా సిద్ధం చేసిన బొడ్రాయిని మంత్రోచ్ఛరణల మధ్య గ్రామం నడిబొడ్డున ప్రతిష్ఠించారు. అనంతరం రేణుకా ఎల్లమ్మ ఆలయం ఎదుట హోమాన్ని నిర్వహించి ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఐక్యతను చాటుతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి యాదిరెడ్డితో పాటు పలువురు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మంగళవారం గ్రామంలో బోనాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు.

నాగార్జునకాలనీ సంక్షేమ సంఘం కమిటీ ఏకగ్రీవం

వనస్థలిపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్ పరిధిలోని నాగార్జునకాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన అధ్యక్షుడిగా ఇ.చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వి.రామకృష్ణారెడ్డి, కోశాధికారిగా సామ వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం.లక్ష్మణ్, డి.చంద్రశేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా జె.సురేందర్‌రెడ్డి, సి.సురేష్‌కుమార్, సాంస్కృతిక కార్యదర్శులుగా ఏ.వేణుగోపాల్‌రెడ్డి, ఎం.రమేష్, ఎల్.సాయికుమార్, సలహాదారులుగా జి.నర్సింహారెడ్డి, పి.రవిశ్రీనివాస్, కె.శ్రీనివాసులు, ఎస్.బాలరాజ్‌గౌడ్, ఎన్.కేశవరెడ్డి, పి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం

సైదాబాద్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మాదన్నపేట మండీలో భూలక్ష్మి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల రెండో రోజు సోమవారం అమ్మవారి రథోత్సవాన్ని ఘనంగా జరిపారు. మార్కెట్ ఆవరణతో పాటు పరిసరాల్లో ఊరేగింపు భక్తిశ్రద్ధలతో రైతులు, వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు నిర్వహించారు. ఊరేగింపు నృత్యాలు, కోలాటాల, డప్పు వాయిద్యాల మధ్య కొనసాగింది. ముందు జాగ్రత్త చర్యలో భాగంగా మండీలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మల్లారెడ్డి, హనుమంతరెడ్డి, రుద్ర నర్సింహ, రమేష్ పాల్గొన్నారు.

ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపిన మహనీయుడు నేతాజీ

మన్సూరాబాద్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): 'నాకు రక్తాన్నివ్వండి-నేను స్వేచ్ఛనిస్తాను' అని యువతలో స్వాతంత్ర్య కాంక్షను రగిల్చి జైహింద్ నినాదంతో ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపిన మహనీయుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ అని బీజేపీ ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి పేర్కొన్నారు. సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని పురస్కరించుకుని ఎల్బీనగర్ అసెంబ్లీ కార్యాలయంలో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాగిరెడ్డి, ముత్యంరెడ్డి, ఆలె పురంధర్, కృష్ణారెడ్డి, విద్యాసాగర్, సుందర్‌నారాయణ, రమేష్‌చారి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తా

సరూర్‌నగర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఏఐసీసీ కోఆర్డినేటర్, మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన బడంగ్‌పేట్ కార్పొరేషన్ 26వ డివిజన్‌లోని న్యూతిరుమలానగర్ కాలనీలో పర్యటించగా, స్థానికులు ఆయనకు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా బోయపల్లి మాట్లాడుతూ కాలనీలోని భూగర్భడ్రైనేజీ, అంతర్గతరోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతామని చెప్పారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, ప్రతినిధులు గోవర్ధన్‌రెడ్డి, కృష్ణకుమార్, వెంకట్‌రెడ్డి, ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఉండాలి



హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీలో వైద్యాధికారి డాక్టర్ తరుణ్

చాదర్‌ఘాట్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే పూర్తిస్థాయిలో నిర్మూలించగలుగుతామని శాలివాహననగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తరుణ్ అన్నారు. సోమవారం హెచ్‌ఐవీ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా టీఎస్ఏసీఎస్ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెచ్‌ఐవీ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. హెచ్‌ఐవీ అనేది ప్రాణాంతకమైన వ్యాధి కాదని, సకాలంలో గుర్తించి మందులను వాడితే నివారణ సాధ్యమన్నారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ రహిత తెలంగాణ రాష్ట్రంగా గుర్తింపు తీసుకురావడానికే ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో టీఎస్ఏసీఎస్ ల్యాబ్ టెక్నీషియన్ బి.కుమారస్వామి, ఎంఏఎస్ ఎన్జీవో సంస్థకు చెందిన బి.పద్మ, కౌన్సిలర్ కె.నిర్మల, విజయలక్ష్మి పాల్గొన్నారు.



సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ దయానంద్, కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు



సరూర్‌నగర్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, అంజన్‌కుమార్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్ తదితరులు



ఎల్బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వద్ద పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, సామ రంగారెడ్డి



జిల్లెలగూడలో సర్వాయి పాపన్నకు నివాళులర్పిస్తున్న గౌడ సంఘం ప్రతినిధులు, నాయకులు

పాపన్నగౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి చౌరస్తాలో దూసరి మధుగౌడ్, కె.సాయికిరణ్‌గౌడ్, టి.పూర్ణచందర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్ గుప్తా, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, ముద్దగౌని లక్ష్మీప్రసన్నగౌడ్‌లు వేర్వేరుగా హాజరై సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనుల రాజ్యాధికారమే ధ్యేయంగా పోరాడిన ధీరశాలి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలవారికి తెలియజేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ ఆంజనేయస్వామి ఆలయ డైరెక్టర్ కంచర్ల కవిత, అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల వేములయ్యగౌడ్, నాయకులు చింతల రవికుమార్, కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, కొత్త రవీందర్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, లగ్గొని శ్రీధర్‌గౌడ్, క్రాంతిగౌడ్, చంద్రకాంత్‌గౌడ్, అనంత రాజుగౌడ్, ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

సాహెబ్‌నగర్‌లో..

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్ బతుకమ్మకుంట వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలకు మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్నగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్ : సరూర్‌నగర్ గౌడ సంఘం వద్ద జరిగిన కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు దయానందస్వామిగౌడ్, మాజీ కౌన్సిలర్ అంజన్‌కుమార్‌గౌడ్, కొత్త రవీందర్‌గౌడ్, జాజుల ప్రవీణ్‌గౌడ్, ఆకుల అఖిల్‌గౌడ్, రాములుగౌడ్, కిరణ్, క్రాంతిగౌడ్, మల్లేష్‌గౌడ్, బొంగు రఘుగౌడ్ పాల్గొన్నారు.

మన్సూరాబాద్ : బడుగుబలహీనవర్గాల ముద్దుబిడ్డ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని టీపీసీసీ మాజీ కార్యదర్శి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, బీజేపీ ఎల్బీనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి సామ రంగారెడ్డిలు పేర్కొన్నారు. ఎల్బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వద్ద సోమవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబాల మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ ఎల్బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, పల్లె గణేష్‌గౌడ్, వెంకటరమణగౌడ్, బొంగు వెంకటేష్‌గౌడ్, విశ్వేశ్వరరావు, గాలెయ్య, లక్ష్మీపతిగౌడ్, రాజుగౌడ్, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సరూర్‌నగర్: సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో స్థానిక గౌడన్నలు, పలు పార్టీల నాయకులు కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడి చందచెరువు కట్టపై గల పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో దిండు భూపేశ్‌గౌడ్, ఉయ్యాల నవీన్‌గౌడ్, పల్లె జంగయ్యగౌడ్, నర్సింహగౌడ్, మోహన్‌గౌడ్, శివగౌడ్, రవిగౌడ్, రమేశ్‌గౌడ్, సంతోష్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, లతాశేఖర్, భిక్షపతిగౌడ్, మల్లేశ్‌గౌడ్, యాదగిరిగౌడ్, వెంకటేశ్‌గౌడ్, బాబు, కుమార్, అనిల్ పాల్గొన్నారు.



సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ప్రభుత్వం పింఛన్ల పెంపు హామీని అమలుచేయాలి

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

సరూర్‌నగర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన పింఛన్ల పెంపు హామీని వెంటనే అమలు చేయాలని, లేని పక్షంలో తమ సమితి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ అన్నారు. పింఛన్ల పెంపు డిమాండ్‌తో సెప్టెంబరు 9న సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న బహిరంగ సభపై చర్చించే నిమిత్తం ఆదివారం రాత్రి బడంగ్‌పేట్‌లోని పీఎంఆర్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే వృద్ధాప్య పింఛన్లు, వికలాంగుల పింఛన్లు, వితంతు పింఛన్లను పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే ఎన్నికల్లో ఆ పార్టీ గెలిచి అధికారం చేపట్టిన తర్వాత సదరు హామీని విస్మరించిందని ఆయన విమర్శించారు. ఎంతో ఉద్యమ చరిత్ర ఉన్న ఎమ్మార్పీఎస్.. పింఛన్ల పెంపు అంశంపై సైతం ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉన్నదని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వాన్ని మేల్కొలపడానికి గాను సెప్టెంబరు 9న పెరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఈ సభకు తరలిరావాలని మంద కృష్ణ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బాబుమాదిగ, రవిమాదిగ, కృష్ణ మాదిగ, అమ్రేశ్‌మాదిగ, సుధాకర్‌మాదిగ, యాదయ్యమాదిగ, శ్రీశైలంమాదిగ, ఎల్లయ్యమాదిగ, ఇందిరమాదిగ, అరుణమాదిగ పాల్గొన్నారు.

ఉద్రిక్తంగా మారిన ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవం

● ఎంఐఎం నేతల పేర్లు శిలాఫలకంపై ముద్రించడంతో వివాదం
● ఎమ్మెల్యే రాకముందే బీజేపీ నేత శంకుస్థాపన
● కమ్యూనిటీ హాల్‌కు తాళం- పోలీసుల భారీ బందోబస్తు



బీజేపీ నేతలతో మాట్లాడుతున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

సైదాబాద్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కుర్మగూడ డివిజన్ ఉప్పరిగూడ కమ్యూనిటీ హాల్‌లో జీహెచ్ఎంసీ నిధులు రూ.10లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్ సోమవారం ప్రారంభించడం ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ఓపెన్ జిమ్‌ను యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, కుర్మగూడ కార్పొరేటర్ షఫత్‌అలీ సోమవారం సాయంత్రం ప్రారంభించేందుకు జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ఏర్పాట్లు చేశారు. కానీ శిలాఫలకంలో ప్రజాప్రతినిధులు కాకుండా ఎంఐఎం నేతల పేర్లు ఉండడంతో అభ్యంతరం వ్యక్తం చేస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్ పార్టీ స్థానిక నేతలతో కలిసి సోమవారం ఉదయం అధికారులకు సమాచారం లేకుండానే జిమ్‌ను ప్రారంభించడం వివాదానికి దారితీసింది. అంతేగాకుండా జిమ్ శంకుస్థాపనకు ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ వస్తే అడ్డుకుంటామని బీజేపీ నేతలు హెచ్చరించడం స్థానికంగా ఉద్రిక్తతకు దారితీసింది. ఘటనాస్థలానికి సైదాబాద్ ఏసీపీ సోము వెంకట్‌రెడ్డి చేరుకుని బీజేపీ నేతలను సముదాయించారు. ఎంఐఎం నేతల పేర్లు ఉన్న శిలాఫలాకాన్ని తొలగించారు. స్థానిక ఉద్రిక్తతల మధ్య ఎమ్మెల్యే ప్రారంభోత్సవానికి రావద్దంటూ పోలీసుల సూచనలతో కార్యక్రమం వాయిదా వేసుకున్నారు. ముందస్తుగా కమ్యూనిటీ హాల్ గేటుకు మాదన్నపేట పోలీసులు తాళం వేసి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇంత వివాదం జరిగినా జీహెచ్ఎంసీ అధికారులు ఘటనా స్థలానికి రాకపోవడం గమనార్హం.

బ్రాహ్మణ సంఘాలను ఏకం చేయడంలో 'బాస్' కృషి అభినందనీయం

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.రామచందర్‌రావు

మన్సూరాబాద్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బ్రాహ్మణ సమాజాన్ని, సంఘాలను ఏకం చేయడంలో 'బాస్'(బ్రాహ్మిణ్స్ ఆర్గనైజేషన్ ఫర్ సోషియల్ సర్వీస్) కృషి అభినందనీయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రామచందర్‌రావు పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ బండ్లగూడలోని వసంత్ విహార్‌లో బాస్ ఆధ్వర్యంలో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇందులో భాగంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా ఎన్.రామచందర్‌రావుకు ఆత్మీయ సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా కాంగ్రెస్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి, ఉమ్మడి ఏపీ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర ఘనుల శాఖ మాజీ డైరెక్టర్ సుశీల్‌కుమార్‌లు విచ్చేశారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ కష్టపడితేనే విజయం సిద్ధిస్తుంది అనేది దృష్టిలో పెట్టుకుని బ్రాహ్మణులు ఏ రంగంలో ఉన్నా పూర్తిస్థాయిలో నిమగ్నమై పనిచేస్తేనే ఆయా రంగాల్లో ఉన్నతులుగా రాణించగలరన్నారు. అనంతరం బాస్ ఆధ్వర్యంలో ఎన్.రామచందర్‌రావును శాలువాలతో సన్మానించి జ్ఞాపికను అందజేసి సత్కరించారు. బాస్ ప్రధాన సలహాదారుడు బసవరాజు శ్రీనివాసరాజు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల నాయకులు, బాస్ సభ్యులు పాల్గొన్నారు.

మద్యంప్రియులకు కౌన్సిలింగ్



మద్యంప్రియులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ ఎస్ఓపీ అల్లారయ్య

కొత్తపేట: డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో మద్యం తాగి పట్టుబడిన వారిలో 106 మంది మద్యంప్రియులకు 106మంది కుటుంబ సభ్యుల సమక్షంలో సోమవారం లెక్చర్‌హాల్‌లో రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ)ఇన్‌స్పెక్టర్ రాచపుడి, ఇన్‌స్పెక్టర్ ఎస్‌పీఓ అమరవర్ధన్‌రెడ్డి, ఎస్ఐ ఎస్ఏపీ అల్లారయ్య పలు విడతల్లో కౌన్సిలింగ్ ఇచ్చారన్నారు.

సహకార సంఘంలో అక్రమాలపై విచారణ జరిపించాలి

● రుణాలు తిరిగి చెల్లించని వారిపై చర్యలు చేపట్టాలి
● సహకార సంఘం ముందు రైతుల నిరసన



బాటసింగారం రైతుసేవా సహకార సంఘం ఎదుట ఆందోళన చేస్తున్న మజీద్‌పూర్ రైతులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): బాటసింగారం రైతుసేవా సహకార సంఘంలో జరుగుతున్న అక్రమాలపై వెంటనే విచారణ జరిపించాలని సంఘంలోని సభ్యులు, రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మజీద్‌పూర్ గ్రామానికి చెందిన పలువురు రైతులు అబ్దుల్లాపూర్‌మెట్‌లోని సహకార సంఘం ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గత పాలకవర్గంలో రుణాల పంపిణీ విషయంలో పాలకవర్గం ఇష్టారీతిన వ్యవహరించినట్లు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశా రు. రైతులకు కేవలం ఒక లక్ష రూపాయలు ఇచ్చేందుకు పాలకవర్గం ముప్పుతిప్పలు పెట్టిందని అదే పాలకవర్గం ఒకే కుటుంబంలోని 9మంది పేర్లపై కోట్ల రూపాయల రుణాలు మంజూరు చేసిందని ఆరోపించారు. పదిఇరవై మంది వద్దనే కోట్ల రూపాయల అసలు, వడ్డీ సంఘానికి రావా ల్సి ఉందన్నారు. 12 ఏళ్ల నుంచి సంఘానికి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. దీంతో సంఘానికి రావాల్సిన కోట్ల రూపాయలు ఆగిపోయాయని దీంతో సంఘం దివాలా తీసే ప్రమాదం ఉన్నదన్నారు. సంఘంలో లక్ష రూపాయలు తీసుకున్న రైతు రుణం చెల్లించకపోతే ఇంటి తలుపులు, టీవీలు లాక్కొచ్చే బ్యాంక్ అధికారులు కొన్ని సంవత్సరాలుగా తీసుకున్న రుణాలు చెల్లించని మొండి బకాయిదారులను ఎందుకు వదిలేస్తున్నారని ప్రశ్నించారు. రైతుల ముసుగులో సంఘం ద్వారా రుణాలు తీసుకుని రియ ల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని తెలిపారు. గత పాలకవర్గంలో కొంతమంది కుమ్మక్కై సంఘాన్ని భ్రష్టుపట్టించారని పేర్కొన్నారు. రైతుల పేరుతో రుణా లు తీసుకుని తిరిగి చెల్లించని వారిపై వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మొండి బకాయిదాలను నుంచి వెంటనే డబ్బులను వసూలు చేస్తామని సంఘం ఛైర్మన్ జైపాల్‌రెడ్డి రైతులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం సంఘం ఛైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు.

కష్టపడి చదివిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

● ఓరియంటేషన్ డేలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కష్టపడి చదివిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బ్రిలియంట్ విద్యా సంస్థల ఛైర్మన్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బ్రిలియంట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. సైంటిస్ట్ డాక్టర్ నోవాలిన్ జాకబ్‌తో కలిసి కసిరెడ్డి నారాయణరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగేళ్ల కష్టపడి చ దివిన విద్యార్థులు భవిష్యత్‌లో సుఖపడుతారన్నారు. ఉన్నత చదువులను అభ్యసించి మంచి రంగాల్లో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ కసిరెడ్డి దుర్గాప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ డాక్టర్ షేక్ రుస్తుం, నరేంద్రకుమార్, వీరన్న, కంట్లం, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

చంపాపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి పిలుపు మేరకు హస్తినాపురం డివిజన్ నందనవనం మూసానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ టీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామల మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న ఇందిరాపార్కు వద్ద ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మహాధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులందరూ మహాధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణారెడ్డి, గౌరవాధ్యక్షుడు పి.రామవేందర్, జిల్లా మాజీ అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్‌యాదవ్, మధుసూదన్‌గౌడ్, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో సీపీఐ నేత సురేష్ మృతి

మన్సూరాబాద్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నాయకుడు భూపతి సురేష్ బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆదివారం రాత్రి మృతిచెందారు. నాగోల్ డివిజన్ జైపురికాలనీకి చెందిన ఈయన 35 ఏళ్లుగా సీపీఐలో కొనసాగుతూ ప్రజల తరఫున చేపట్టిన అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. సీపీఐ జైపురికాలనీ ఫేజ్-1 శాఖ కార్యదర్శిగా నాలుగు పర్యాయాలు, ఉప్పల్ మండల కౌన్సిల్ సభ్యుడిగా రెండు పర్యాయాలు, అఖిల భారత యువజన సమాఖ్య నాగోల్ శాఖ అధ్యక్షుడిగా భూపతి సురేష్ పనిచేశారు. సురేష్ మృతితో సోమవారం ఆ పార్టీ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా ఆయన పార్థీవదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించాడు. అనంతరం ఆయన అంత్యక్రియలను స్థానిక శ్మశానవాటికలో నిర్వహించారు.

భారీ వర్షాలకు కూలిన ఇల్లు



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కార్పొరేటర్ షాహిద్, తహసీల్దార్ జయశ్రీ

చాదర్‌ఘాట్: భారీ వర్షాల కారణంగా చావునీ డివిజన్‌లోని చావునీ ప్రాంతంలో రేకుల ఇల్లు కూలింది. మూడు గదులతో కూడిన ఇంటిలో వసీమా బేగం కుటుంబీకులు మరో గదిలో ఉండగా రేకుల పైకప్పుతోపాటు పక్కనున్న గోడలు కూడా కూలిపోయాయి. ఈఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు. విషయం తెలిసిన వెంటనే చావునీ డివిజన్ కార్పొరేటర్ సలాం షాహిద్, సైదాబాద్ తహసీల్దార్ ఎం.జయశ్రీ, ఆర్ఐలు జగదీష్, యూనుస్‌లతో కలిసి సందర్శించి బాధిత కుటుంబీకులను పరామర్శించారు.

మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న ముఠా

● ఓ రౌడీషీటర్ సహా నలుగురి అరెస్టు
● రూ.1.28లక్షల విలువైన 74 ఇంజక్షన్లు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మెఫంటర్మైన్ సల్ఫేట్, నిందితులు

హైదరాబాద్ సిటీ : వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా అక్రమంగా మెఫెంటర్మైన్ సల్ఫేట్ మత్తు ఇంజక్షన్‌లు వినియోగిస్తున్న నలుగురు నిందితులను హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్(హెచ్ న్యూ) చాదర్‌ఘాట్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద 1.28లక్షల విలువైన 74 బాటిళ్ల మెఫంటర్మైన్ ఇంజక్షన్‌లు, 4మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ వైవీ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేటకు చెందిన మహ్మద్ ఇమ్రాన్ అలీపై చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ నమోదై ఉంది. చెడు వ్యసనాలకు బానిసైన ఇమ్రాన్, మత్తుకలిగించే మెఫంటర్మైన్ ఇంజక్షన్‌లు వినియోగిస్తున్నాడు. తాను వినియోగించడంతో పాటు.. వాటిని ఇతరులకు ఎక్కువ ధరకు విక్రయించి ఇంజక్షన్‌ల కోసం కాచిగూడకు చెందిన రితేష్‌కుమార్ వద్ద కొనుగోలు చేసేవాడు. అతని వద్ద స్టాక్ లేకపోతే అతని సోదరుడు మోహిత్‌కుమార్ వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇతరులకు ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. మెడికల్ డిస్ట్రిబ్యూషన్ వ్యాపారి వినయ్‌కుమార్‌ను సంప్రదించాడు. నిజానికి వాటిని డాక్టర్‌ల ప్రిస్క్రిప్షన్ లేకుండా వినియోగం చేయకూడదు. ప్రభుత్వం నుంచి లైసెన్స్ లేకుండా విక్రయించడం నేరం. విశ్వసనీయ సమాచారం అందుకున్న హెచ్‌న్యూ పోలీసులు చాదర్‌ఘాట్ పోలీసులతో కలిసి నిందితులను పట్టుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.